
కథ

# మనసా.. మనసా!

నామని సుజనా దేవి

ఏడుపు తన్నుకొస్తోంది రవళికి. ఛ..ఛ.. పాడు జీవితం. ప్రొద్దున్న హడావుడిగా కూరగాయలు తరుగుతూ కోసుకున్న వేలు విపరీతంగా నొప్పెడుతోంది. అలాగే సింక్ నిండా ఉన్న గిన్నెలన్నీ తోమేసరికి నొప్పి పెరిగిపోయింది. ఇంకా ఉతకాల్సిన బట్టలన్నీ అలాగే ఉన్నాయి. భర్తకు అన్నం పెడుతూ, కోసుకుపోయిన వేలును ఊదుకుంటుంటే కనీసం, 'అయ్యో...కోసుకుపోయిందా! మరి పని అంతా ఎలా చేస్తావు?' అని ఒక్క సానుభూతి మాట కూడా అనలేదు సరికదా! 'దేనికైనా తొందరే! కాస్తంత చూసి నెమ్మదిగా పనిచెయ్యవు కదా! ఆ ఆయింట్‌మెంట్ రాసుకో' అంటూ శుభ్రంగా తిని వెళ్లిపోయాడు.



ఇదే పెళ్లయిన కొత్తలో ఒకసారిలా కోసుకుంటే, ''అయ్యో!'' అంటూ వెంటనే వేలు నోట్లో పెట్టుకుని తీసి, ''ఇప్పుడు బాధ తగ్గింది కదూ!'' అంటూ వేలిపై మురిపెంగా ముద్దిచ్చేవారు. అప్పుడు పులకరించిన మనస్సుకు అసలు ఆ బాధెటు పోయిందో తెలిసేది కాదు.

తొందర.. అంటే.. తొందరగా చేయకపోతే ఎనిమిది గంటలకే పిల్లలు స్కూల్‌కి ఎలా వెళతారు? ఎంత ప్రొద్దుట లేచినా ఏం లాభం.. ఏదో రకంగా చివరకు హడావుడి అవుతోంది. పైగా రాత్రి పదకొండు గంటలయిపోయినా పడుకోనివ్వరు. తనకేం.. తెల్లవారి తీరిగ్గా లేస్తారు. తనలా లేస్తే పనులన్నీ ఎవరు చేయాలి. కనీసం సానుభూతి చూపించడం చేతకాదు గానీ.. ఏదో పేద్ద.. చేసిపెడుతున్నట్లు విసుక్కోవడమొకటి. తానేమైనా కావాలని కోసుకుంటుందా?

కనీసం ఒక్క మాట ప్రేమగా ''అయ్యో! ఎలా కష్టపడుతున్నావు?'' అనో ''చూడు, అంట్లు తోమి, తోమి లేత తమలపాకుల్లాంటి నీ అరచేతులెంత మోటుగా తయారవుతున్నాయి?'' అనో ఒక్క ఓదార్పు మాట ప్రేమగా అంటే వద్దన్నా ఇంటెడు చాకిరీ చేయదూ! ఆ... అయినా ఇప్పుడు మాత్రం చేయక ఛస్తుందా!

పెళ్లికి ముందు, ఎంగేజ్‌మెంట్ అయ్యాక ఒకసారి గుడికి రమ్మని తనను తీసుకెళుతూ దారిలో కాలికి ముల్లు గుచ్చుకుంటే 'అబ్బా' అని తాననగానే హడావుడిగా వచ్చి క్రింద కూర్చుని, కాలిముల్లు తీసి, ఎవరూ లేరు కదా అని ఎత్తుకుని... ఇంత నొప్పి కదా! ఎలా నడుస్తావు.. ఇలా ఎత్తుకుని తీసికెళతానంటే... ఈమాత్రం దానికేనా! అంటూ తాను సిగ్గులమొగ్గై ఎలా ముడుచుకుపోయింది. ఇప్పుడా ప్రేమంతా ఎక్కడకు పోయింది. అవునులే.. ఇప్పుడు ఇద్దరు బిడ్డల తల్లిని కదా! ఇంకా ఎందుకుంటుందీ?

కాలేజీ లైఫ్‌లో కూడా తనందాన్ని చూసి ఎంతమంది తనకు దాసోహమవ్వలేదు. కానీ తానే అందర్నీ తిరస్కరించి పదిలంగా దాచుకున్న అందాన్నంతా భద్రంగా ఆయనకు అర్పించుకుంది. తనపై ఎంతమంది కవితలల్లలేదు. కానీ ఈయన మాత్రం అదేమిటో ఆరాధిస్తూ చూస్తాడు. తాను అతనిపై కవిత్వం రాసినా చూసి సంతోషిస్తాడు కానీ... ఒక్క మాట కూడా తనందం గురించి పొగడడు.

తను అడిగితే ''ఈ అందమంతా నా సొంతమే కదా! నా అందాన్ని నేనెలా పొగడుతాను?'' అంటారు. కనీసం బయటకు ఎక్కడికైనా వెళ్లినా చేతిలో చేయి వేసుకుని చెట్టాపట్టాలేసుకుని నడుస్తూ సరదాగా ఉండాలనిపిస్తుంది తనకు. కానీ

ఆయన గంభీరంగా ఉంటారు. ''పిల్లల దృష్టిని ఆకర్షిస్తుంది. బావుండదు'' అంటారు. బెడ్ రూంలో అతని అల్లరి చూసి విస్తుపోయి బయట అలా అంటీముట్టనట్లు ఉంటారేం అని అడిగితే, ''మనం భార్యాభర్తలం, మన మధ్య ఆ బంధం ఉందని అందరికీ తెలుసు, పైకి కనపడేలా పదుగురికీ చాటుకోవడం ఎందుకూ. అందరినీ ఆకర్షించడం ఎందుకు'' అంటారు.

వెధవ బతుకు. ప్రొద్దుట్నుంచి, మధ్యాహ్నం వరకు చాకిరే సరిపోతుంది. ఏది చేయకపోయినా గడవదు. మధ్యాహ్నం భోజనం చేశాక పిల్లల రిపేర్ చేయాల్సిన బట్టలు కుట్టడమో, తన జాకెట్లు కుట్టడమో, బియ్యం చేయడమో, ఏదో పని చేసేసరికి సాయం సంధ్య ఆదరబాదరాగా ఏదో కొంప అంటుకుపోతున్నట్లు రావడం, సాయంత్రం పనులు చేసేసరికి ఆయనా పిల్లలు రావడం, హోంవర్క్‌లు.. వంట.. భోజనం..తోమటం.. నిద్ర.. వరుసగా రొటీన్‌గా జరిగిపోతాయి.

'లేచింది మహిళా లోకం...దద్దరిల్లింది పురుష ప్రపంచం' అంటూ వస్తున్న తనకిష్టమైన పాటను, 'ఎక్కడ లేచింది?' అంటూ టపీమని ఆపేసింది కోపంగా మండుతున్న వేలును ఊదుకుంటూ.

ఇలా ఆలోచిస్తూ కూర్చుంటే అక్కడ విడిచిన బట్టలు అలాగే ఉంటాయి. తెల్లవారితే శుక్రవారం. ఇంకా ఎక్కువ పని అనుకుంటూ ఎలాగోలా బట్టలన్నీ పిండి ఆరేయటానికి డాబాపైకి వెళ్లింది. ఆరేస్తూ యథాలాపంగా వీధిలోకి చూసిన ఆమెకు ఎదురింటి ముందు సామాను దించుతూ కనబడ్డాడతను. అంటే ఖాళీగా ఉన్న ఎదురింటిలోకి కొత్తగా వస్తున్నారన్న మాట అనుకుంటూ కుతూహలంగా పిట్టగోడనానుకుని చూసింది.

కొన్నే సామాన్లున్నాయి. ఒక్కడే ఉన్నట్లుంది. మేలిమి బంగారం లాంటి శరీర చాయ, నుదుటిపై పడే జుట్టు, నిటారుగా ఉన్న ముక్కు, సన్నని మీసకట్టుతో సినీ హీరోలా ఉన్నాడు.

డబ్బులిచ్చి వ్యాన్‌ను పంపించేస్తూ తిరిగిన అతని దృష్టి తననే చూస్తున్న రవళిపై బడింది. ఆమె అందానికి ముగ్ధుడైనట్లు ఎదురింటి మేడపైకి చూస్తూ అలాగే నిలబడిపోయాడు.

చటుక్కున వెనుదిరిగి వచ్చేసింది రవళి. ఛ! తను మరీ అలా చూస్తూ నిలబడిందేమిటి? ఏమనుకుని ఉంటారు? అయినా అనుకోవడానికేముంది? పెళ్లి అయినట్లు లేదు.. అయినా తనకెందుకు అనుకుంటూ, టీవీ కవర్‌పై చేసిన ఎంబ్రాయిడరీ ఇంకా సగం మిగిలిపోవడంతో పూర్తి చేయడానికి కూర్చుంది. ఒక అరగంట కాగానే కాలింగ్ బెల్ మోగటంతో ఇప్పుడెవరై ఉంటారబ్బా... అనుకుంటూ తలుపు తెరిచింది. ఎదురింట్లోకి సామాన్లు దించుతూ కనిపించిన తను.

తలుపు తీసిన రవళిని అలాగే చూస్తూ నిలబడ్డాడు. చంద్రబింబం లాంటి మోముపై గాలికి అల్లనల్లన కదులుతున్న నల్లటి తుమ్మెదల్లాంటి ముంగురులు ముసురుకొనగా తీర్చిదిద్దినట్లున్న కనుబొమల నడుమ ఎర్రటి సిందూరం మెరుస్తుండగా పల్చటి లేత గులాబి రేకుల్లాంటి పెదాలు, చెలమలో అటుఇటు తిరుగుతున్న మీనాల్లాంటి కళ్లతో దివి నుండి భువికి దిగివచ్చిన అప్సరసలా ఉందామె.

కన్నార్పకుండా చూస్తున్న అతన్ని చూడగానే ఇబ్బందిగా ఫీలవుతూ, ఏం కావాలన్నట్లుగా గొంతు సవరించడంతో ఈ లోకంలోకొచ్చినట్లు ''ఓ...సారీ...నా పేరు ఆనంద్. నేను మీ ఎదురింటిలోకి ఇవాళే వచ్చాను. మరేమో ఈవాల్టికి ఈ జగ్‌లో మంచినీళ్లిస్తారా!'' అన్నాడు మాటలు కూడబలుక్కుంటున్నట్లు. అతని కళ్లల్లో ఏదో ఆరాధనాభావం.

''జగ్‌తో ఏం సరిపోతాయి'' అంటూ చిన్న బిందె నిండా నీళ్లిచ్చింది రవళి.

''థాంక్యూ'' అని, ''యు ఆర్ బ్యూటిఫుల్...సారీ... ఇలా అన్నానని మరోలా అనుకోకండి. అందం ఎక్కడ కనిపించినా మెచ్చుకోవడం నాకలవాటు'' అంటూ వెళ్లిపోయాడు.



'ఏంటి అతను.. అసలు ఎప్పుడూ ఆడదాన్ని చూడనట్లు అలా చూస్తాడేం.. అయినా అతను అలా బ్యూటిఫుల్ అంటే చడామడా తిట్టేయక తను మౌనంగా ఉండెందుకని? అయినా అతను మాత్రమేమన్నాడు? అందాన్ని మెచ్చుకున్నాడు. ఏదైనా అందంగా ఉంటే అలా అనడంలో తప్పేం లేదు కదా! అయినా తన అందానికి కాలేజ్‌లో ఎన్ని కాంప్లిమెంట్స్ వచ్చాయి? ఎన్ని ప్రేమలేఖలు అందుకుంది. కానీ పెళ్లయ్యాక తన భర్త ఒక్కసారైనా అలా మెచ్చుకున్నాడా? లేదే!

మర్నాడు శుక్రవారం కావటంతో తలంటు స్నానం చేసి పిల్లలని, శ్రీవారిని అందరినీ సాగనంపాక రణరంగంలా ఉన్న ఇంటిని ఒక కొలిక్కి తీసుకొచ్చేసరికి బాగా అలిసిపోయింది రవళి. మరోసారి మొహం కడుక్కుని ఫ్రెష్‌గా తయారై జుట్టు ఆరటానికి, జారుముడి విప్పి ఫాన్ కింద కూర్చుంది రవళి. చల్లటిగాలికి ఒక్క క్షణం ఇలా కూర్చుందో లేదో కాలింగ్‌బెల్ మ్రోగటంతో వెళ్లి తలుపు తీసింది.

ఎదురుగా మళ్లీ అతనే.. ఆనంద్.

''నమస్తే'' అంటూ ముందురోజు పట్టుకెళ్లిన చిన్న బిందె తీసుకొచ్చాడు. ఇచ్చేసి వెళ్లిపోతాడేమోననుకుని చేయి ముందుకు చాస్తుంటే-

''అదేంటి? లోనికి రానివ్వరా ఏమిటి?'' అన్నాడు చొరవగా.

పక్కకు తప్పుకుని లోనికొచ్చింది రమ్మన్నట్లుగా, కుర్చీ జరిపింది కూర్చోమన్నట్లు.

### ఐశ్వర్యా హాజిర్ హో!

**బహిరంగ వేదికపై శిల్పాశెట్టిని రిచర్డ్ గెరె ముద్దుపెట్టుకోడం సంచలనం సృష్టించింది. అందుకు శిల్పాకి కోర్టు నోటీసులు కూడా వెళ్లాయి. ఇలాగే బహిరంగ ప్రదేశంలో కాకపోయినా తెరపై అందరూ చూసేలా ముద్దు పెట్టుకున్నందుకు ఐశ్వర్యారాయ్‌కి కూడా కోర్టు నోటీసులు వచ్చాయిట. 'ధూమ్-2'లో హృతిక్ రోషన్‌ని ముద్దు పెట్టుకున్నందుకు పబ్లిక్‌గా అశ్లీల ప్రవర్తన నేరం కింద ఆమెపై కోర్టులో బీహార్‌కి చెందిన ఓ ఆసామీ కేసు వేయడంతో ఆమెకి కోర్టుసమన్లు వచ్చాయిట. ఈ కేసు విషయమై ఐశ్ మే 30న కోర్టుకి హాజరు కావాల్సి వుంది.**

''శుక్రవారమేమైనా మౌనవ్రతంగానీ పాటిస్తారా!'' అన్నాడు కూర్చుంటూ.

''ఆ..'' అని ''అహహ..'' అంటూ అతని ప్రశ్న అర్థమైనట్లు నవ్వింది.

కన్నార్పకుండా చూస్తూ ''మీ ఇంట్లో ఎన్ని వేల ముత్యాలున్నాయండీ?'' అన్నాడు తదేకంగా చూస్తూ.

''ముత్యాలు...వేలా...అబ్బే...ఎక్కడివండి'' అంది అసందర్భపు ప్రశ్నకు తొట్రుపడుతూ.

''అంటే...మీరెప్పుడూ నవ్వరా!''

అప్పుడర్థమయింది రవళికి. పెద్దగా నవ్వేస్తూ ''మీరు భలే తమాషాగా మాట్లాడతారండీ!'' అంది ఒకింత పొంగిపోతూ.

ఇలా తర్వాత కూడా రోజూ తను వచ్చేవాడు. అతను వస్తే గంటలు నిమిషాల్లా గడిచిపోయేవి. మధ్యాహ్నం కాగానే కళ్లు అతని కొరకు ఎదురుచూసేవి. బహుశా మనసులో ఏ మూలో అతని మాటలు వినాలనే ఆకాంక్ష ఉండటం, అవి తన అహాన్ని సంతృప్తి పరచడం వల్లేమో ఒక్కోసారి ఛ... ఏంటి రోజూ అతను రావడం... ఎవరైనా ఏమనుకుంటారు? అయినా బిజినెస్ అంటాడు మరి పన్నెండు నుండి ఏమీ ఉండదా! ఎప్పుడైనా ఈ విషయం అడిగితే 'మీ కోసం త్యాగం చేస్తున్నానంటాడు' ఆ మాటలు ఒక్కోసారి భయం పుట్టించేవి. ఎక్కడైనా హద్దు మీరుతున్నానా అనిపించేవి. కానీ అంతలోనే తనేం తప్పు చేయట్లేదే! ఎందుకు భయపడాలి? అనుకునేది. దానికి తోడు వాక్చాతుర్యంతో అతను మాట్లాడే మాటలు కూడా అలాగే ఉండేవి. ఒకటి రెండుసార్లు మాటల మధ్య అతని టాపిక్ వచ్చినపుడు భర్తతో కూడా చెప్పేది. కానీ అతను రెండు మూడుసార్లు చెప్పాక ''రవళీ! అతివినయం ధూర్త లక్షణం అన్నట్లున్న వారి ప్రవర్తన పసిగట్టగల నేర్పు వివేకవంతురాలివైన నీకున్నాయని నాకు తెలుసు. మన గురించి మరొకరు చులకనగా మాట్లాడేందుకు తావివ్వకుండా మన ప్రవర్తన ఉండాలన్న విషయం నీకు తెలీదని నేననుకోను'' అంటూ కట్ చేశాడు.

నిజంగా ఎంత పెద్ద భావాన్ని రెండు మాటల్లో వ్యక్తీకరించాడు అనిపించి, భర్త విశాల హృదయానికి మనస్సులోనే జోహార్లర్పించింది. అలా అన్నాక ఒక రెండు రోజులు ముభావంగా ఆనంద్ వస్తే సరిగ్గా మాట్లాడకపోయేది. అప్పుడతను ''మీరు ఈమధ్య ఫ్రీగా ఉండట్లేదు. నాకు అన్నం కూడా సహించడం లేదు. ఎన్నో భావాలు ప్రతిఫలించే మీ విశాల కలువ కన్నులు నిస్సారంగా ఉండటం నే చూడలేను రవళీ'' అనేవాడు. దానితో మళ్లీ మామూలుగా మాట్లాడేది.

ఒకరోజు అలాగే మాట్లాడుతూ చటుక్కున ఆమె చేయి అందుకుని ముద్దు పెట్టి, ఆమె చేతిలో ఒక చీటీ పెట్టి వెళ్లిపోయాడు. ఇదంతా క్షణంలో జరగటంతో నోటమాట రాక నిర్ఘాంతపోయి చూస్తూ ఉంది రవళి. వెక్కిరిస్తూ కనబడిన చేతిలోని ఉత్తరాన్ని వణుకుతున్న చేతులతో తెరిచింది.

'ప్రియమైన దేవతకి,

నీలాంటి మహోన్నత అందాలరాశి ఇలా వంటింటి కుందేలుగా మగ్గిపోవల్సిందేనా! మచ్చలేని చంద్రబింబంలాంటి నీ మోము, నల్లటి తుమ్మెదల్లా పిరుదులను దాటు నీ కురులు.. అసలు తళుక్కున మెరిసే తటిల్లతలాంటి నీ శరీరమంతా ఇలా అందరి సేవలకు హూనమైపోవలసిందేనా.. ఈ దారుణం నేను చూడలేను. నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటాను. నువ్వు లేక నేను ఉండలేను. రేపు మళ్లీ ఇదే సమయానికి వస్తాను.

ఇట్లు
నీ పాదసేవకుడు
ఆనంద్'

ఉత్తరం చదవగానే ఫాన్ ఫుల్‌స్పీడ్‌లో ఉన్నా ఒళ్లంతా చెమటలు పట్టి, కాళ్లు చేతులు ఆడక అలాగే కూర్చుండిపోయింది. అసలు తనకేమయ్యింది. ఇన్ని రోజులు అతని మాటల మాయాజాలంలో పడిపోయి, కేవలం ఆడమగ మాట్లాడుకుంటే ఏదో ఉందనుకోవాలా? అనుకుంటూ స్నేహం అని పేరు పెట్టుకుంది. కానీ ఇప్పుడేమయ్యింది. ఆడ, మగ స్నేహంగా ఉండలేరా? తప్పక అది ప్రేమగా మారాలా? దీనికే తను 'నాగరికత' అని పేరు పెట్టి తన భర్తకు ఈ సంస్కృతి తెలియదనుకుందా! ఛ... అసలు అతను చొరవగా తన గురించి పొగిడినప్పుడే ఖండిస్తే ఇంత దూరం వచ్చేదా! కనీసం చేయిని తాకినప్పుడైనా అలాగే ఒక్క చెంపదెబ్బ ఇచ్చి ఉంటే ఇంత ధైర్యం చేసేవాడా! అసలు తను కొంచెం ఫ్రీగా మాట్లాడితే ఏమనుకున్నాడు? అయినా తనదే తప్పు. పొగడగానే పొంగిపోయి అతి చొరవకి చనువిచ్చింది. ఛీ.. ఛీ.. ఈ చొరవను, తను ఏమీ మాట్లాడకపోవడాన్ని అలుసుగా తీసుకుని అవకాశం తీసుకున్నాడు అతను' అనుకుంది రవళి.

ఆ రోజంతా మనసు మనసులో లేదు. భర్తకు చెప్పాలా వద్దా అనుకుంటూ ఆ రోజంతా అన్యమనస్కంగా గడిపింది. ఆ రాత్రి ''ఎందుకలా ఉన్నావని'' ఆప్యాయంగా అడిగిన భర్తతో, చెప్పే ధైర్యం లేక ఒంట్లో బాలేదంది.

తెల్లవారే వచ్చిన ఆనంద్‌ని గుమ్మంలోనే నిలబెట్టి చెడామడా దులిపి దడాలున తలుపు వేసుకుంది. అప్పుడుగానీ ఆమె మనసు శాంతించలేదు. పొగడగానే ఐసయిపోయే తనలాంటి మనస్తత్వం ఆడవాళ్లలో ఎప్పుడు పోతుందోననుకుంటూ బహుశా ఆ పొగడ్త ఏ మూలో ఆడవారి అహాన్ని చల్లార్చుతుండటం వల్లేమో అనుకుంది. అయినా తను చాకిరీగానీ, సేవగానీ ఎవరికి చేస్తోంది? తన భర్త.. తన పిల్లలకేగా? అది అతనన్నట్లు చాకిరీగాని సేవగాని ఎలా అవుతుంది. ప్రేమగా చేసే బాధ్యత ఇష్టం అవుతుంది గానీ అది తానెన్నడైనా కష్టంగా భావించిందా? అంటే మాటల జిమ్మిక్కులతో తనను ఎంతగా తిప్పుకున్నాడు అతనివైపు. అమ్మో...ఇంకా కొన్నిరోజులు అదే మాటల మాయలో ఉంటే ఇంకేమైనా ఉందా.. ఈ ఆలోచనలతో మనసంతా గందరగోళంగా ఉండటంతో, ఆ రాత్రి భర్తతో జరిగిందంతా చెప్పి, క్షమాపణ అడిగితేకానీ మనసుకి ప్రశాంతత రాలేదు రవళికి.

''పిచ్చిదానా లోకం పోకడ తెలియదు నీకు. అయినా ఇందులో నీ తప్పేముంది? అది ఒక పీడ కల అనుకో. నేను ఆఫీస్ వర్క్ హడావుడిలో ఒక వేళ నీ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినా ఎందుకు అలా ప్రవర్తిస్తాను? నీపై నాకున్న భద్రతాభావం, నీవు నా దానివేనన్న నమ్మకంతోనే కదా! మనసులు గానీ మనుషులుగానీ పూర్తి దగ్గరగా కాలేనపుడు ఎదుటివాళ్లు ఏమనుకుంటారోనన్న భయం వల్ల సున్నితంగా ప్రవర్తిస్తారు. కానీ ఎప్పుడైతే ఎదుటి వాళ్ల దగ్గరై పూర్తిగా కలిసి ఇద్దరం ఒకటే అన్న స్టేజీ వస్తుందో అప్పుడు అంతటా విసిగిన మనస్సు చిరాకు ప్రదర్శించడానికే ఎవరూ దొరకక 'నా' అనే వాళ్లపై ప్రదర్శించి స్వాంతన పొందుతుంది. అదే నువ్వు పరాయిదానివైతే నిన్ను ఏమైనా మాట అనగలనా... అన్నా నువ్వు పడతావా? 'నువ్వు నా దానివే' అనే భావనే నాకంతులేని బలాన్నిచ్చి, నీ సమక్షంలో మనస్సులోని చిరాకంతా బయటపడి మనస్సుని ప్రశాంతంగా ఉంచుతుంది. నువ్వలా నాపై చిరాకు పడితే నేనెప్పుడైనా ఏమైనా అన్నానా! మౌనంగా ఉన్నాను. ఎందుకంటే మనస్సుపై ఒత్తిడి ఎక్కువైనప్పుడు ఆటోమాటిక్‌గా అది దగ్గరివాళ్ల దగ్గరే బయటపడుతుంది. ఇంకా ఎక్కువ ఆలోచించి మనస్సు పాడుచేసుకోకు. బీ హేపీ'' అంటూ ఆమె మనస్సుని చదివినట్లు అతను మాట్లాడుతుంటే, అతని విశాలహృదయానికి పొంగిపోతూ, అది తన స్వంతమైనందుకు ప్రశాంతమైన మనస్సుతో అతని గుండెల్లో ఒదిగిపోయింది రవళి తృప్తిగా.

మరో రెండు రోజులకు అతను ఇల్లు ఖాళీ చేశాడని వింది రవళి. తర్వాత నెల రోజులకు పేపర్‌లో ఫోటోతో సహా అతని గురించి వేశారు. పేర్లు మార్చుకుని వాక్చాతుర్యంతో అమాయకపు అందమైన అమ్మాయిలను ఆకర్షించి దుబాయ్ షేకులకు అమ్మేస్తాడని, అలా ఎవరినో చేస్తూ రెడ్ హేండెడ్‌గా దొరికిపోయాడని రాశారు. భర్త చూపగా, అది చూసిన రవళికి, తనెంత పెద్ద గండం నుండి బయటపడిందో తెలిసింది.

☆